ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 12 జూలై 2025



భారత వాయుసేనలో ఉద్యోగావకాశాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): భారత వాయుసేనలో ఉద్యోగాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మెడికల్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్‌తో కలిపి కనీసం 50శాతం మార్కులతో ఉత్తీరణ కలిగి ఉండాలి. ఫార్మశీలో డిప్లొమా/బీఎస్సీ చేసిన వారు కూడా అర్హులు. వీరు 02-07-2005 నుంచి 02-07-2009 మధ్య జన్మించి ఉండాలి. ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తాం. ఉత్తీర్ణులైన వారికి శారీరక ధృడత్వ పరీక్ష, అడాప్టబిలిటీ టెస్ట్-2, మెడికల్ టెస్టులు నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు.

ఆ నాలుగు గ్రామాలు.. అంతేనా?

అణువిద్యుత్ పరిశ్రమ నిర్మించతలపెట్టిన.. ఆ నాలుగు గ్రామాలకు ఎటువంటి నిధులు లేవు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు కావడం లేదు. మౌలిక వసతుల కల్పన ఊసేలేదు. పారిశుధ్య పనులు చేపట్టడం లేదు. సమస్యలను పరిష్కరించడం లేదు. దీనిపై అధికారులను అడిగితే.. ఇక్కడ గ్రామాలే లేనప్పుడు ఎలా నిధులు విడుదల చేస్తామని ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు దశాబ్దాలుగా అదే మాట వినిపిస్తోంది. దీంతో ఆ నాలుగు గ్రామాల ప్రజల్లో తీరని వ్యథ కనిపిస్తోంది. పునరావాసాలు కల్పించకుండానే తమ గ్రామాలు తొలగించినట్టు పేర్కొనడంతో ప్రభుత్వ పరంగా ఎటువంటి నిధులు రావడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

- 'అణు విద్యుత్' నిర్వాసితులకు పునరావాసం కరువు
- కొవ్వాడ, చిన్నకొవ్వాడ, రామదాసుపేట, గూడెంలో నిలిచిన అభివృద్ధి
- రికార్డుల్లో తొలగింపుతో విడుదలకాని ప్రభుత్వ నిధులు
- కనీస మౌలిక వసతులు లేక ప్రజల ఇబ్బందులు


కొవ్వాడ గ్రామం

రణస్థలం, జూలై 11(ఆంధ్రజ్యోతి):

సరిగ్గా 34 ఏళ్ల కిందట అప్పటి కేంద్ర ప్రభుత్వం రణస్థలం మండలం కొవ్వాడలో అణు విద్యుత్ పరిశ్రమకు శ్రీకారం చుట్టింది. కొవ్వాడ పంచాయతీ పరిధిలోని కొవ్వాడ, చిన్నకొవ్వాడ, రామదాసుపేట, గూడెం గ్రామ ప్రజలను నిర్వాసితులుగా గుర్తించింది. అయితే వారికి పునరావాసం కల్పించకుండానే ఆ నాలుగు గ్రామాలు తొలగించబడ్డాయని రికార్డుల్లో పేర్కొనడంతో ప్రభుత్వ నిధులు రావడం లేదు. అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. నిధులు లేక పంచాయతీ పాలకవర్గంలో నిస్సహాయత కనిపిస్తోంది. కనీస వసతులు లేక ఆ నాలుగు గ్రామాలు తీవ్ర వ్యథను అనుభవిస్తున్నాయి. 1991లో కొవ్వాడ పరిసర ప్రాంతాల్లో అణువిద్యుత్ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనలను మత్స్యకారులు, ప్రజాసంఘాలు, పర్యావరణ వేత్తలు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజల్లో భయాందోళనలు, అపోహలు నివృత్తి చేసి ప్లాంట్ ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పడంతో మత్స్యకారులు భూసేకరణకు అంగీకరించారు. రూ.లక్ష కోట్ల వ్యయంతో 1208 మెగావాట్ల సామర్థ్యంతో ఆరు రియాక్టర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. భూసేకరణతో పాటు పరిహారం చెల్లించారు. కానీ దశాబ్దాలు గడుస్తున్నా ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేయలేదు. అటు పునరావాస కాలనీ నిర్మించి నిర్వాసితులకు అప్పగించలేదు. పరిశ్రమ ఏర్పాటుకాకపోవడంతో స్థానికంగా ఉండేందుకు అభ్యంతరాలు లేకపోయినా.. ప్రభుత్వం నుంచి ఆర్థిక సంఘం నిధులు ఈ గ్రామాలకు రావడం లేదు. ఉపాధిహామీ పథకం పనులు పూర్తిస్థాయిలో కల్పించలేదు. దీంతో సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పంచాయతీ వద్ద నిధులు అంతంతమాత్రమే కావడంతో కనీస వసతులు లేక ఆయా గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు.




కొవ్వాడలో పూడికలతో నిండిన కాలువ, పాడైన సీసీ రోడ్డు

● పునరావాసంలోనూ నిర్లక్ష్యం..

అణువిద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం కొవ్వాడ, చిన్నకొవ్వాడ, రామదాసుపేట, గూడెం పరిధిలో సుమారు 2,079 ఎకరాల భూమిని సేకరించారు. ఈ నాలుగు గ్రామాల్లో 3వేల వరకూ ఇళ్లు ఉన్నాయి. సుమారు 4,500 మంది జనాభా ఉన్నారు. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐఎల్) పర్యవేక్షణలో ఇళ్లు కోల్పోయిన వారికి స్వయంగా కట్టిస్తామని చెప్పారు. అందుకు అనేక ప్రాంతాలను పరిశీలించారు. తర్జనభర్జన నడుమ చివరకు ఎచ్చెర్ల మండలం ధర్మవరంలో నిర్వాసిత కాలనీ ఏర్పాటుకు నిర్ణయించారు. 190 ఎకరాలను రైతుల నుంచి సేకరించారు. కానీ ఒక్క ఇటుక కూడా అక్కడ వేయలేదు. పునరావాసం కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● సమస్యలెన్నో..

కొవ్వాడ పంచాయతీలో నాలుగు గ్రామాల్లో ముఖ్యంగా తాగునీటి సమస్య వేధిస్తోంది. బోర్లలో ఉప్పునీరు వస్తోంది. దీంతో మహిళలు సుదూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. అప్పట్లో ఎన్‌పీసీఐఎల్ రక్షిత మంచినీరు అందిస్తామని చెప్పింది. అది కూడా లేకుండా పోయింది. దశాబ్దాల నాటి కాలువలు కావడంతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. గ్రామంలో ప్రభుత్వ భవనాలకు రక్షణ లేదు. కనీస మరమ్మతులు లేక భవనాలు కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. పాఠశాల చుట్టూ రక్షణ గోడలు లేక వరద నీరు చొచ్చుకొస్తోంది. కుక్కలు, పందులు, విష జంతువులు సైతం స్వైరవిహారం చేస్తున్నాయి. ఇన్ని ఇబ్బందులు (మిగతా 6వ పేజీలో..)


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి | సత్తారు గోపి (ఫైల్)

ఫరీద్‌పేటలో పట్టపగలే హత్య

- మృతుడి బంధువుల నిరసన
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

8లో


పలాసలో క్రీడా వికాస కేంద్రం ఇలా..

మైదానాల్లేవ్.. ఆటలు ఎలా?

- మూలకు చేరిన ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాలు
- టీడీపీ హయాంలో నిర్మాణాలు ప్రారంభం
- నిర్వహణను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- కూటమి సర్కార్‌పై క్రీడాకారుల ఆశలు

కాశీబుగ్గ, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడా మైదానాలు కరువయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను తయారుచేయాలన్న ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున పది క్రీడా వికాస కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. వ్యాయామ శాలతో పాటు ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్‌కు సంబంధించి మైదానాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు కొన్ని నియోజకవర్గాల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. మరికొన్నిచోట్ల నిర్మాణ పనులు సాగాయి. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిర్మాణం పూర్తయిన వాటిని సరిగ్గా నిర్వహించలేకపోయింది. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను అలానే వదిలేసింది. దీంతో క్రీడాభివృద్ధి లక్ష్యం మరుగున పడిపోయింది.

● పలాస నియోజకవర్గంలో క్రీడాకారులకు కొదువ లేదు. ఉద్దానం ప్రాంతంలో కబడ్డీ క్రీడాకారులు అధికం. ఇతర క్రీడలపై ఆసక్తి ఉన్నవారు ఉన్నారు. అందుకే పలాసలో 2018లో క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించింది టీడీపీ సర్కారు. 25 శాతం నిర్మాణాలను పూర్తిచేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన (మిగతా 6వ పేజీలో..)

'అగ్నివీర్'లు అవుతారా?

- ఆగస్టు 1 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ
- వేలాది ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు
- సిద్ధమవుతున్న జిల్లా అభ్యర్థులు

6లో

వేతనాలు పెంచే వరకూ పోరాటం

- కలెక్టరేట్ వద్ద మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల ధర్నా

నేర నియంత్రణకు పటిష్ఠ చర్యలు

- మహిళల భద్రతపై దృష్టి పెట్టండి
- ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

6లో



హౌరా చెన్నై మెయిల్‌లో 'ఈగల్ టీమ్' తనిఖీ

శ్రీకాకుళం, జూలై 11(ఆంధ్రజ్యోతి): హౌరా చెన్నై మెయిల్ రైలులో శుక్రవారం 'ఈగల్ టీమ్' ఆధ్వర్యంలో తనిఖీ చేపట్టారు. మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా సాగుతున్నాయోమోనని పరిశీలించారు. డీజీపీ, ఈగల్ ఐజీపీ ఆదేశానుసారం శ్రీకాకుళం ఈగల్ టీమ్, జీఆర్పీ పోలీసులు, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస పోలీసులు, జిల్లా డాగ్‌స్క్వాడ్ కలిసి పలాస నుంచి విజయనగరం రైల్వేస్టేషన్ వరకు మెయిల్ రైలులో సుమారు రెండు గంటలపాటు తనిఖీలు చేశారు. ప్రతీ బోగిలో అనుమానం వచ్చిన వాటిపై మరింత పరిశీలించారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన అవసరం

- డీఎంహెచ్‌వో డా.అనిత

7లో

వంశధార ప్రధాన ఎడమ కాలువకు రంధ్రం

- పూడ్చిన అధికారులు

8లో

వారికి మినహాయింపా?

- ప్రైవేటు విద్యాసంస్థల్లో తగ్గని పుస్తకాల భారం
- ప్రభుత్వ పాఠశాలల్లోనే నిబంధనలు అమలు

టెక్కలి రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఉల్లంఘిస్తున్నాయి. విద్యార్థుల శరీర బరువులో రెండో వంతు పుస్తకాల సంచి మోస్తూ బడికి వెళ్లిరావడం అనారోగ్యానికి కారణమవుతుందని ఇప్పటికే పలు నివేదికలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. విద్యావ్యవస్థలో పలు మార్పులకు శ్రీకారం చుట్టారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పుస్తకాల బ్యాగ్‌ల బరువు తగ్గించాలని నిర్ణయించారు. ఈ ఏడాది అన్ని పాఠశాలల్లో సెమిస్టర్ విధానాన్ని తీసుకువచ్చారు. కాగా.. ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాల సంఖ్య తగ్గినా.. జిల్లాలోని చాలా ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం పుస్తకాల బరువు తగ్గడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

● నాలుగు, ఐదో తరగతుల విద్యార్థుల పుస్తకాల బ్యాగ్ బరువుపై ఎన్‌సీఈఆర్టీ ఇటీవల సర్వే చేసింది. సాధారణంగా విద్యార్థుల శరీర బరువు 18 నుంచి 22 కిలోలు ఉండగా, ప్రభుత్వ బడుల్లో పుస్తకాల బరువు 10 నుంచి 12 కిలోలు ఉన్నట్టు గుర్తించింది. ప్రైవేటు పాఠశాలల్లో 14 నుంచి 18 కిలోలు ఉన్నట్టు తేలింది. దీంతో ఈ ఏడాది నుంచి సెమిస్టర్ విధానం తీసుకురావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాల బరువు ఐదు కిలోల లోపే ఉంది. ప్రైవేటు పాఠశాలలో మాత్రం పుస్తకాల బరువు తగ్గలేదు సరికదా.. ప్రతీ తరగతికీ పెరుగుతూనే ఉంది. ప్రైవేటు పాఠశాలల్లో 8, 9, 10 తరగతి విద్యార్థులు (సీబీఎస్) 25 కిలోల నుంచి 35కిలోల వరకు పుస్తకాల బరువు మోస్తున్నారు.




బరువైన పుస్తకాల బ్యాగులతో ప్రైవేటు పాఠశాల విద్యార్థినులు

ప్రభుత్వ పాఠశాలల్లో ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లో 1, 2 తరగతుల విద్యార్థులకు ఒక పాఠ్యపుస్తకం, ఒక వర్క్‌బుక్ ఇస్తున్నారు. 3, 4, 5 తరగతులకు మొదటి సెమిస్టర్‌లో భాష సబ్జెక్టులన్నీ కలిపి ఒక పుస్తకం, వర్క్‌బుక్, ఇతర సబ్జెక్టులన్నీ మరో (మిగతా 6వ పేజీలో..)

శారీరక, మానసిక సమస్యలు

బరువైన పుస్తకాల బ్యాగ్ మోస్తే.. పిల్లల్లో వెన్ను, కండరాల నొప్పులకు దారి తీసే ప్రమాదం ఉంది. శారీరక, మానసిక సమస్యలు పెరిగే అవకాశం ఉంది. అనారోగ్య కారణంగా చదువుపై ఏకాగ్రత దెబ్బతింటుంది. విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతారు.

- డా.పావని, వైద్యాధికారి, చాపర ఆరోగ్య కేంద్రం

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి నుంచే పుస్తకాల బరువు తగ్గించేందుకు సెమిస్టర్ విధానం ప్రారంభించారు. పుస్తకాల బరువు పెంచిన ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం.

- మల్లారెడ్డి పద్మనాభం, ఎంఈవో-2, మెళియాపుట్టి

పొలాలగట్లపై రేషన్

- వెంటాడుతున్న సిగ్నల్స్ సమస్య
- గిరిజనులకు తప్పని ఇబ్బందులు

మెళియాపుట్టి, జూలై 11(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మారుమూల ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేసినా.. సిగ్నల్ సక్రమంగా లేక అవస్థలు పడుతున్నారు. పొలాల గట్లు, బహిరంగ ప్రదేశాల్లో సిగ్నల్స్ కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. అక్రమాల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ నిలిపివేసింది. రెండు నెలలుగా డిపోల్లో డీలర్ల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేస్తోంది. ప్రతీ నెల ఒకటో తేదీ నుంచి 15లోగా రేషన్ సరుకులు పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాలని స్పష్టం చేసింది. కాగా, మెళియాపుట్టి మండలం పోలూరు జీసీసీ డిపోలో మాత్రం ఈ నెల 9 నుంచి రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభించారు. ఒకవైపు సిగ్నల్ లేక బయోమెట్రిక్ కోసం ఇబ్బందులు పడుతుండగా.. ఇక్కడ పనిచేస్తున్న సేల్స్‌మెన్ దేవిడ్‌ను పాతపట్నం జీసీసీ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో అల్లూరిసీతారామరాజు జిల్లా జీసీసీ సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న కేశవరావును ఈ నెల 10న ఇక్కడ నియమించారు. దీంతో రేషన్ పంపిణీ ఆలస్యమైంది. డిపో పరిధిలో సుమారు 381 రేషన్‌కార్డులు ఉన్నాయి. గ్రామంలో సిగ్నల్ సక్రమంగా లేకపోవడం, రేషన్ సరుకుల పంపిణీకి గడువు సమీపిస్తుండడంతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. సిగ్నల్స్ కోసం పొలాల గట్ల వద్దకు వెళ్లి బయోమెట్రిక్ వేసేందుకు అవసోపాలు పడుతున్నారు. సిగ్నల్ సమస్య కారణంగా రోజుకు 20 మంది లబ్ధిదారులకు కూడా సరుకులు అందడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి గిరిజన ప్రాంతాల్లో రేషన్ సరుకుల పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.


పోలూరులో పొలం గట్టుపై బయోమెట్రిక్ వేయించి.. రేషన్ సరుకుల పంపిణీ



అగ్నివీర్‌లవుతారా?

- ఆగస్టు 1 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ
- వేలాది ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు
- సిద్ధమవుతున్న అభ్యర్థులు

శ్రీకాకుళం, జూలై 11(ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని నిరుద్యోగులకు శుభవార్త. రక్షణ దళాల్లో చేరి.. అటు దేశానికి సేవచేసే అదృష్టంతో పాటు ఇటు ఉపాధి పొందే అవకాశం లభిస్తోంది. ఆగస్టు 1 నుంచి కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. అగ్నిపథ్‌లో భాగంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యింది. మొత్తం 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాకినాడలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో 13 జిల్లాలకు సంబంధించిన అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్, ఈవెంట్స్ పరీక్షలు జరుగనున్నాయి. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్‌కీపర్, టెక్నికల్, ట్రేడ్స్‌మెన్ పోస్టులు భర్తీ చేయనున్నారు. రోజుకు 800 మందికి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పోస్టులను దక్కించుకునేందుకు జిల్లాకు చెందిన అభ్యర్థులు గత కొద్ది నెలలుగా కఠోర శ్రమ పడుతున్నారు. ఫిజికల్ టెస్టులకు సంబంధించి సాధన చేస్తున్నారు. ప్రస్తుతం ఏ పట్టణం, గ్రామంలో చూసినా నిరుద్యోగ యువత ఎక్కువగా సాధన చేయడం కనిపిస్తోంది.సరైన మైదానాలు లేకపోవడంతో అభ్యర్థులు రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో సాధన చేయాల్సి వస్తోంది.

● ఈ పరీక్షలు తప్పనిసరి..

అన్ని పోస్టులకు ఫిజికల్ టెస్టులో అర్హత సాధించడం తప్పనిసరి. అందులో భాగంగా పరుగుపందెం ఉంటుంది. 1.6 కిలోమీటర్ల దూరాన్ని 5 నిమిషాల 30 సెకెన్లలో పూర్తి చేస్తే 60 మార్కులు, 5 నిమిషాల 31 సెకెన్ల నుంచి 45 సెకన్లలోపు పూర్తి చేస్తే 48 మార్కులు ఇస్తారు. కనీసం ఆరు పుల్‌అప్స్ తీయాలి. 6 తీసిన వారికి 16 మార్కులు, 7 తీస్తే 21, ఎనిమిది పుల్‌అప్స్ తీస్తే 27, తొమ్మిదికి 33, 10 తీస్తే 40 మార్కులు పొందవచ్చు. 9 అడుగుల మేరకు లాంగ్ జంప్ వేస్తే అర్హత సాధిస్తారు. జిగ్‌జాగ్ బ్యాలెన్స్‌లో అర్హత సాధించాలి. అనంతరం ఫిజికల్ మెజర్‌మెంట్, మెడికల్ పరీక్షలు ఉంటాయి. వీటిన్నింటిలో విజయవంతమైతే శిక్షణకు ఎంపిక చేస్తారు.

● వేతనాలు ఇలా..

అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికైతే తొలి ఏడాది నెలకు రూ.30 వేలు, రెండో ఏడాది నెలకు రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది నెలకు రూ.40 వేలు వేతనంగా అందిస్తారు. నాలుగేళ్లకు సేవానిధి ప్యాకేజీని అందిస్తారు. వార్షిక సెలవులు 30 వరకూ ఉంటాయి. ఆరోగ్య సమస్యలను బట్టి సిక్ లీవ్ ఇస్తారు. నాలుగేళ్ల పాటు సర్వీసులో ఉన్నపుడు రిస్క్ అండ్ హార్డ్‌షిప్, రేషన్, డ్రెస్, ట్రావెల్ అలవెన్స్‌లు అందిస్తారు. నాలుగేళ్ల పాటు రూ.48 లక్షలకు లైఫ్ ఇన్సూరెన్స్ కవర్ చేస్తారు. నాలుగేళ్ల సేవకుగాను వీరికి అగ్నివీర్ స్కిల్ సర్టిఫికెట్ అందిస్తారు. ఇంటర్ సమాన స్థాయి సర్టిఫికెట్ అందిస్తారు. వీరికి పింఛన్, గ్రాట్యూటీ వర్తించవు. ఎక్స్ సర్వీస్‌మెన్‌గా గుర్తించరు. కరువుభత్యం, మిలటరీ సర్వీస్ పే వీరికి వర్తించదు. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సైతం వీరికి ఉండదు. నాలుగేళ్ల వ్యవధి పూర్తి చేసుకున్న అగ్నివీర్ బ్యాచ్ నుంచి 25 శాతం మందిని ఆర్మీలో రెగ్యులర్ ఉద్యోగులుగా తీసుకుంటారు. దీనికి నాలుగేళ్ల వ్యవధిలో చూపిన ప్రతిభను ప్రామాణికంగా తీసుకుంటారు. ఇలా ఎంపికైన వారు 15 ఏళ్ల పాటు ఆర్మీ సర్వీసులో కొనసాగవచ్చు.

● సేవానిధికి ఇలా జమ..

సేవానిధిలో భాగంగా ప్రతి నెలా అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్‌ఫండ్‌కి జమ చేస్తారు. మొదటి నెల పొందే రూ.30 వేల వేతనంలో రూ.9 వేలను కార్పస్ ఫండ్‌కు బదలాయిస్తా రు. అగ్నివీర్‌కు కేవలం రూ.21 వేలు మాత్రమే అందుతుంది. రెండో ఏ డాది వచ్చేసరికి రూ. 23,100 వేతనం రూపం లో అందుతుంది. రూ. 9,900 నిధికి జమ అవుతుంది. మూడో ఏడాదికి రూ.25,500 వేతనంగా అందుతుంది. రూ.10,950 నిధికి వెళుతుంది. నాలుగో ఏడాదిలో వేతనంగా రూ.28 వేలు, నిధికి రూ.12 వేలు వెళతాయి. ఇలా నాలుగేళ్లలో అగ్నివీర్ సేవా నిధికి రూ.5.02 లక్షలు పోగవుతుంది. ఇంతే మొత్తం ప్రభుత్వం జమ చేస్తుంది. ఈ లెక్కన ఈ నాలుగేళ్లలో రూ.10.04 లక్షలు అందుతాయన్న మాట. దీనికి వడ్డీ మొత్తం కలిపి అందిస్తారు. అగ్నివీర్‌లకు బ్యాంకు రుణం అందే సదుపాయాన్నీ కల్పిస్తారు.

25శాతం మందికి శాశ్వతంగా..

'అగ్నివీర్ వాయు' కేటగిరీలో నాలుగేళ్ల పాటు సేవా అవకాలు కల్పించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిలో 25శాతం మందిని శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాల్లో నియమిస్తారన్నారు. ఈనెల 31 వరకు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం ఉందన్నారు. వివరాల కోసం సంబంధిత వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు. ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోవాలని కోరారు.

యువతకు సువర్ణావకాశం..

నిరుద్యోగ యువతకు ఇదో సువర్ణావకాశం. దీనిని సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా శారీరక దారుఢ్య పరీక్షలపై దృష్టి పెట్టాలి. ఇంకా 20 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఉదయం, సాయంత్రం సాధన చేయడం ఉత్తమం. రాత పరీక్షకు సంబంధించి గత పరీక్ష ప్రశ్నపత్రాలను ఎప్పటికప్పుడు చూసుకోవాలి. వాటికి అనుగుణంగా సాధన చేస్తే చాలా మంచిది. అభ్యర్థులు దళారుల బారిన పడకూడదు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ఈ విషయాన్ని గుర్తించుకోవాలి.

-చీకటి రమేష్, మాజీ సైనికుడు



వారికి మినహాయింపా?

(ఐదో పేజీ తరువాయి)

వర్క్‌బుక్‌గా అందజేశారు. అధికంగా తెలు గు, ఇంగ్లిష్, హిందీ ఒక పుస్తకంగా ముద్రించ డం వల్ల విద్యార్థులకు సులువు అయినట్టు చెబుతున్నారు. 6,7 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ కలిపి ఒక పాఠ్యపుస్తకంగా అందజేశారు. గణితం, సైన్స్,సోషల్ పాఠ్యపుస్త కంగా ఇచ్చారు. 8,9 తరగతులకు భాషా పాఠ్యాంశం ఒకటి, భౌతిక శాస్త్ర, జీవశాస్త్రం కలిపి ఒకటి, భూగోళ శాస్త్రం, రాజకీయశాస్త్రం, చరిత్ర కలిపి ఒక పుస్తకంగా చేశారు. 9 వతరగతికి అదనంగా వర్క్‌బుక్ ఇచ్చారు. 10 వతరగతి మాత్రం విడివిడిగా పుస్తకాలు ముద్రించి అందజేశారు. ఇలా ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాల బరువు తగ్గించినా.. ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం బరువు తగ్గడం లేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

ఆ నాలుగు గ్రామాలు.. అంతేనా?

(ఐదో పేజీ తరువాయి)

నడుమ జీవనం సాగించాల్సి వస్తోందని ఆ నాలుగు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పునరావాసం కల్పించకపోయినా రికార్డుల్లో మాత్రం తమ గ్రామాలను తొలగించినట్టు చూపడంతో అధికారులు కూడా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టి పెట్టాలి..



అప్పుడెప్పుడో అణు విద్యుత్ పరిశ్రమ కోసం భూములు సేకరించారు. నష్ట పరిహారం చెల్లించారు. కానీ పరిశ్రమ ఏర్పాటు చేయలేదు. పునరావాసం కల్పించలేదు. ఇప్పుడు గ్రామాల్లో కనీస మౌలిక వసతులు లేవు. ఎందుకంటే ఈ గ్రామాలు వేరే ప్రాంతానికి తరలిపోయాయని రికార్డుల్లో పేర్కొన్నారు. కొత్తగా వసతులు లేవు. ఉన్న సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

-ఉప్పాడ లక్ష్మి, కొవ్వాడ, రణస్థలం

అంతా అస్తవ్యస్తం..



గ్రామంలో తాగునీరు లేదు. బోర్ల నుంచి ఉప్పునీరు వస్తోం ది. సుదూర ప్రాంతాల నుంచి మహిళలు నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. పాఠశాల చుట్టూ అస్తవ్యస్తంగా ఉంది. వరద, మురుగు నీరు వస్తోంది. ఇలా ప్రతిదీ సమస్యే. అణు విద్యుత్ పరిశ్రమ విషయంలో ఏదో ఒకటి తేల్చేయాలి. లేదంటే భూములు వెనక్కి ఇచ్చి.. గ్రామాలు ఇక్కడే ఉంటాయని ప్రకటించాలి. **-మైలపల్లి అప్పారావు, చిన్నకొవ్వాడ, రణస్థలం**

మైదానాల్లేవ్.. ఆటలు ఎలా?

(ఐదో పేజీ తరువాయి)

వైసీపీ ప్రభుత్వం మిగతా పనులు పూర్తిచేయడంలో విఫలమైంది. దీంతో క్రీడాకారులకు అది శాపంగా మారింది. క్రీడా మైదానం చుట్టూ పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి.

● ఇచ్ఛాపురం నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి. ఇక్కడ క్రీడాకారులకు సంబంధించి ఎటువంటి ప్రోత్సాహం లేకుండా పోయింది. ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంతో క్రీడాకారులకు ప్రోత్సాహం అందుతుందని భావించారు. కానీ రాజావారి మైదానంలో పునాదులతోనే పనులు నిలిచిపోవడంతో క్రీడాకారులకు నిరాశ తప్పలేదు.

● టెక్కలి నియోజకవర్గంలో అప్పట్లో మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడు ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం నిర్మాణాన్ని పూర్తిచేయించారు. అప్పట్లో ముగ్గురు శిక్షకులను కూడా నియమించారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దీని నిర్వహణను గాలికొదిలేసింది. ప్రస్తుతం ఒక శిక్షకుడు పేఅండ్ ప్లే విధానంలో పనిచేస్తున్నారు. ఒక్క బ్యాడ్మింటన్ కోర్టు మాత్రమే అందుబాటులో ఉంది. వ్యాయామశాల మూతపడింది. నీటి సదుపాయం లేకపోవడంతో మరుగుదొడ్లు నిరూపయోగంగా మారాయి.

● పాతపట్నంలో సైతం ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం అందుబాటులోకి వచ్చింది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహణను గాలికొదిలేసింది. కనీసం కేంద్రం చుట్టూ జంగిల్‌క్లియరెన్స్ కూడా చేపట్టలేదు. దీంతో అటువైపుగా వెళ్లేందుకు కూడా క్రీడాకారులు సాహసించడం లేదు.

● ఆమదాలవలస నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి. జగ్గులశాస్త్రులపేటలో ఎన్టీఆర్ క్రీడావికాస కేంద్రం ఏర్పాటైంది. వైసీపీ ప్రభుత్వం అంతర్జాతీయ క్రికెట్ మైదానం పేరుతో దానిని ధ్వంసం చేసింది. కానీ అక్కడ ఎటువంటి మైదానం ఏర్పాటు చేయలేదు. దీంతో క్రీడాకారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

● నరసన్నపేటలో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం కొంతవరకూ అందుబాటులోకి వచ్చింది. కానీ ఇండోర్ స్టేడియం నిర్మాణం నిలిచిపోయింది. బ్యాడ్మింటన్ ఉడెన్ కోర్టు నిర్మాణం నిధులు లేక నిలిపివేశారు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది.

● శ్రీకాకుళం నియోజకవర్గంలో పాత్రునివలస, కళింగపట్నంలో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాలను ఏర్పాటుచేయాలని భావించారు. కళింగపట్నంలో 25శాతం పనులతో నిలిపివేశారు. పాత్రునివలసలో గోడల వరకూ నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు.

● ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి రణస్థలంలో క్రీడావికాస కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు. ఇక్కడ ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని పూర్తిచేశారు. కానీ నిర్వహణను గాలికొదిలేశారు. ఇక్కడ ఒక్క శిక్షకుడు మాత్రమే ఉన్నారు. ఇలా వైసీపీ ప్రభుత్వ హయాంలో పడకేసిన క్రీడా వికాస కేంద్రాలను వీలైనంతవరకూ అందుబాటులోకి తేవాలని క్రీడాకారులు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం..

జిల్లాలో క్రీడా వికాస కేంద్రాల ఏర్పాటు, నిర్వహణకు నిధుల కొరత వెంటాడుతోంది. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం తప్పకుండా వీటి నిర్మాణం పూర్తిచేస్తుంది. త్వరలో సిబ్బంది, శిక్షకులను సైతం నియమించే అవకాశం ఉంది. ఆగిపోయిన పలాస, ఇచ్ఛాపురం ప్రాజెక్టులకు సంబంధించి మళ్లీ అనుమతి కోసం కలెక్టర్‌కు నివేదిక అందజేశాం.

-శ్రీధర్, డీఎస్‌డీవో, శ్రీకాకుళం



నరసన్నపేట: నక్కవీధిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



పాతపట్నం: రంకినిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

సంక్షేమ పాలన
తెలుగుదేశంతోనే సాధ్యం

సంక్షేమ పాలన తెలుగుదేశంతోనే సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యేలు అన్నారు. 'సుపరిపాలన తొలిఅడుగు' కార్యక్రమాన్ని జిల్లాలోని వివిధ నియోజకవర్గాలలో శుక్రవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి... ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ శ్రేణులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



సోంపేట: పల్లిగొల్లగండిలో ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న విప్ అశోక్



అరసవల్లి: పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శంకర్



సారెను తీసుకు వెళుతున్న గ్రామస్థులు

అమ్మవార్లకు
ఆషాఢమాస సారె

కోటబొమ్మాళి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఊడికలపాడు గ్రామంలో వెలిసిన కొత్తమ్మతల్లి, దుర్గమ్మతల్లి, చెవిటమ్మతల్లికి గ్రామస్థులు శుక్రవారం ఆషాఢ మాస సారెను సమర్పించారు. శ్రీరామ మందిరం నుంచి గ్రామస్థులంతా కలసి మిఠాయిలు, పండ్లు, చీరలను తీసుకొని బయలుదేరి.. అమ్మవార్లకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు సనపల కరుణ్‌కుమార్, హనుమంతు వెంకటరావు, నేతింటి వెంకటరావు, మెండ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉన్న సంతోషిమాత ఆలయంలో అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో అష్టోత్తర శతనామార్చన, కుంకుమ పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శాకంబరిగా అలంకరించిన దృశ్యం



కంచిలి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

నేర నియంత్రణకు పటిష్ఠ చర్యలు

- మహిళల భద్రతపై దృష్టి పెట్టండి
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

సోంపేట/కంచిలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం సోంపేట, కంచిలి పోలీసు స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్‌లో రికార్డుల నిర్వహణ, ప్రజా సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై ఆరా తీశారు. మహిళా సమస్యలకు ప్రాధాన్యమిచ్చి... పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసులు, వాటి ఫైళ్లను పరిశీలించారు వాటి పురోగతిపై ఆరా తీశారు. రౌడీ షీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తులు, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని ఆయన సూచించారు. ప్రతి రోజూ గ్రామాలను సందర్శించాలని... నారీ శక్తి, సైబర్ నేరాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నేరాలను అరికట్టేందుకు రాత్రి గస్తీని మరింత పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు దత్తత కానిస్టేబుల్, మహిళా పోలీసులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోంపేట సీఐ బి.మంగరాజు, కంచిలి, సోంపేట ఎస్ఐలు పి.పారినాయిడు, లవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న హమాలీలు

ఐఎంఎల్ కొత్త డిపో జీవోను ఉపసంహరించుకోవాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి కొత్త డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎచ్చెర్ల డిపో హమాలీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగార్రాజు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి, టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటుకు ఉత్తర్వులు ఇచ్చిందని, దీనివల్ల 80 పేద దళిత హమాలీలు రోడ్డున పడతారన్నారు. ఎచ్చెర్లలో 100 మంది దళిత కుటుంబాల నుంచి 1986లో 4 ఎకరాల భూమిని సేకరించారని, అప్పటి నుంచి ఆ కుటుం బాల వారే కార్మికులుగా, హమాలీలుగా ఉపాధి పొందుతున్నారన్నారు. ఇప్పుడు డిపోను విడగొట్టడం వల్ల వారంతా జీవనోపాధి దెబ్బతింటుందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను ఉప సంహరించుకుని కార్మికులకు ఉపాధి కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి ఎన్‌వీ రమణ, లండ ఎతారాం, ఎన్.రమణ, లింగాల రాము, సొంట్యాన శ్రీనివాసరావు, నవిరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచేంతవరకూ పోరాటం

- కలెక్టరేట్ వద్ద మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల ధర్నా

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచేంతవరకూ పోరాటం సాగుతుందని ఆ యూనియన్ గౌరవా ధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజు స్పష్టం చేశారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్రకమిటీ పిలుపు మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగర పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న ఆఫీసు సిబ్బంది, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కార్మికుల సంఖ్యను పెంచి పనిభారం తగ్గించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనా విభాగం అధికారి జీపీ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నేతలు గురుమూర్తి, పార్థసారథి, గణేష్, రసూల్, మణి, కల్యాణి తిరుమలరావు, అరుగుల రమణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మునిసిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు

న్యూస్ బాక్స్

పీఏసీఎస్ చైర్మన్‌గా బాసుదేవ్

కవిటి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కవిటి పీఏసీఎస్ చైర్మన్‌గా ఎర్ర బాసుదేవ్ ప్రదాన్, మెంబర్లుగా సిందుల గున్నయ్య, బొగియా భారతిలను నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులను శుక్రవారం వారు అందుకున్నారు. అనంతరం వారంతా కలిసి ఎమ్మెల్యే, విప్ బెందాళం అశోక్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఇంట్రాక్ట్ క్లబ్‌ల ఏర్పాటు

ఇచ్ఛాపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఇంట్రాక్ట్ క్లబ్‌లను ఏర్పాటు చేశారు. శుక్రవారం రోటరీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఇంట్రాక్ట్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులను ఎంపిక చేశారు. జ్ఞాన భారతి, స్వర్ణభారతి, శాంతినికేతన్, సత్యసాయి, రవీంద్రభారతి, హైబ్రాండ్, కస్తూర్బా, హైస్కూల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో ఈ కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు డాక్టర్ మోహన్ వెంకటేష్‌రెడ్డి, రామకోటి, క్లబ్ సభ్యులు డాక్టర్ దక్కత త్రినాథ్‌రెడ్డి, జోహర్‌ఖాన్, దక్కత కృష్ణమూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు

అరసవల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం విశాఖ-ఎ కోలనీలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ సమస్య వచ్చినా తనను నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ప్రజాదర్బార్‌తో సమస్యల పరిష్కారం

ఆమదాలవలస, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ దోహదపడుతుందని టీడీపీ రాష్ట్ర నాయకుడు మొదలవలస రమేష్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్ యాదవ్, రాష్ట్రమాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి

లావేరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లికి వెళ్లే మార్గంలో సుభద్రాపురం జంక్షన్ వద్ద రోడ్డు మధ్య పెద్ద రంధ్రం ఏర్పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నెలల తరబడి ఈ గొయ్యి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా స్పందించి గొయ్యిని పూడ్చి ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు మధ్య గొయ్యి

కుటుంబ నియంత్రణపై అవగాహన అవసరం

● డీఎంహెచ్‌వో డా.అనిత



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డా.అనిత తదితరులు

అరసవల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రజలు కుటుంబ నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే గర్భధారణ గురించి ఆలోచించాలన్నారు. 2011 నుంచి 2021 వరకు జననాల రేటు 6 శాతానికి తగ్గిందన్నారు. ప్రజారోగ్యాన్ని మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూ పొందించిందన్నారు. పెళ్లి వయసు పురుషులకు 25, స్త్రీలకు 21 సంవత్సరా లుండాలన్నారు. ఆడపిల్లల సంఖ్యను పెంచి, ఆడ, మగ సమతుల్యతను సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఐవో డా.రాందాసు, ఎస్‌వో రామ నాగేశ్వరరావు, డెమో ఎం.వేంకటేశ్వరరావు, ఎస్.విజయలక్ష్మి, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మానవవనరుల పాత్ర కీలకం

పొందూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): దేశాల అభివృద్ధిలో మానవ వనరుల పాత్ర అత్యంత కీలకంగా మారిందని పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మధుసూదనరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత నిర్బంధ విద్యతో ప్రయోజనాలు: వీసీ



వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజనిని సత్కరిస్తున్న అధ్యాపకులు

ఎచ్చెర్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): మానవతా దృక్పథంతో ఉచిత విద్య నిర్బంధంగా అమలు చేయడం ద్వారా ప్రయోజనాలున్నాయని, దీనివల్ల అక్షరాస్యతతో పాటు సామాజిక, ఆర్థిక ప్రమాణాలు మెరుగుపడతాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీ విద్యా విభాగం ఆధ్వర్యంలో 'ప్రత్యేక విద్య, ఉచిత విద్య, నిర్బంద విద్యా హక్కు చట్టం' అనే అంశంపై మూడు రోజుల నిరంతర పునరావాస విద్య (సీఆర్‌సీ) కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. న్యూఢిల్లీ భారత పునరావాస మండలి సహకారం (ఆర్‌సీఐ) సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తు న్నారు. ఆమె మాట్లాడుతూ.. ఈ తరహా శిక్షణ తరగతులతో ప్రత్యేక విద్యా పాఠశాల, ఎన్‌జీవోల్లో పనిచేసే బోధకులు, కౌన్సిలర్లు, శిక్షకులు నైపుణ్యం పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రిన్సిపాళ్లు ఎస్.ఉదయ భాస్కర్, ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు, విద్యా విభాగం అధ్యాపకులు ఎన్.శ్రీనివాస్, జేఎల్ సంధ్యారాణి, హెచ్.సుబ్రహ్మణ్యం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో బీఆర్ఏయూ రిజిస్ట్రార్

ఎచ్చెర్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని ఇండియా హెబిటేట్ సెంటర్‌లో శుక్ర వారం జరిగిన నేషనల్ క్వాంటమ్ మిషన్ (ఎన్.క్యూమ్) సదస్సులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత పాల్గొన్నారు. అలాగే జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జె.హుస్సేన్ నాయక్‌ను కలిసినట్లు తెలిపారు. వర్సిటీలో ఎస్టీ కేటగిరీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపై ఇటీవల వివరణ కోరుతూ కమీషన్ నుంచి లేఖ రావడంతో సంబంధిత సమాచారంతో రిజిస్ట్రార్‌తో పాటు హుస్సేన్ నాయక్ ను కలిసినట్లు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జి.సిగడాం, జూలై 11(ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డా.కె.అనిత అన్నారు. జి.సిగడాం పీహెచ్‌సీని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెంచాలని అన్నారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులుచేపట్టేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు యశ్వంత్, సుమబిందు, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాశాల స్థలం ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు గుర్తిస్తున్న అధికారులు

జి.సిగడాం, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా స్థలం ఆక్రమించి గడ్డి కుప్పలు, కర్రలను ఓ వ్యక్తి ఉంచడంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తంచేసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు తహసీల్దార్ చరిత, ఎస్ఐ మధుసూదనరావు శుక్ర వారం సదరు స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని సర్వే చేసి హద్దులు నిర్ణయించి అప్పగించారు. అంతకు ముందు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.పవిత్ర, డి.చందు మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలకు చెందిన 1.50 ఎకరాల ఆట స్థలాన్ని హరినాథ్ బాబా కబ్జా చేశారని, దీంతో స్థలంలేక విద్యార్థులు ఆడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణ ఆక్రమణలను తొలగించాలని కోరారు.

పాఠశాలను తరలించొద్దు



నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

ఆమదాలవలస, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలను తరలించవద్దని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి వారి తల్లిదండ్రులు నిరసన తెలిపారు. ప్రైమరీ పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్పు చేయవద్ద న్నారు. పాఠశాలను తరలిస్తే సహించేది లేదన్నారు. పాఠశాలలో కనీసం 12 మంది విద్యార్థులుండాలని నిబంధనలు చెబుతున్న అధికారులు ఇక్కడ సుమారు 21 మంది విద్యార్థులుంటే వారందరినీ చిన్న కృష్ణాపురం ప్రభుత్వ పాఠశాలకు పంపేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణం ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

సాగునీటి కాలువల్లో పూడికతీత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పూడికతీత అనంతరం బూరవెల్లి కాలువ

గార జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేలాది ఎకరాలకు సాగునీరందించే బైరి కాలువ, దాని పిల్ల కాలువల్లో పూడిక తీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'కాలువలు ఇలా సాగు నీరు ఎలా' శీర్షికతో వచ్చిన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. కాలువల్లోని పూడికలు తొలగించే పనులు చేపట్టారు. బైరి కాలువలో కొంతభాగం, బూరవెల్లి, అంబళ్లవలస, పిల్ల కాలువల్లో పూడిక తొలగించే పనులు చేయడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. జలవనరుల శాఖ డిప్యూటీ ఈఈ కాసిన క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారు.

కళాశాలలో దంత వైద్య శిబిరం

ఎచ్చెర్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఆర్ పురంలోని కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవ సాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్ర వారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. సాయి డెంటల్ కళాశాల వైద్యులు దంత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోష్, ప్రజాతంత్ర వైద్య విభాగం ఆచార్యులు ఆక్టర్ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలి: డీఎస్పీ

బూర్జ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలని డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. ఓవీపేట మోడల్ స్కూల్‌లో నారీశక్తిపై అవగాహనా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మహిళలకు సంబంధించిన చట్టాలు, పలు అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవల్లిక, ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా సురేష్



లావేరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా ముప్పిడి సురేష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆయన పేరును ప్రతిపాదించగా డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, ఎచ్చెర్ల నియోజకవర్గ పరిశీలకుడు అన్నెపు రామకృష్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులడు చౌదరి నారాయణ మూర్తి, ఏఎంసీ మాజీ చైర్మన్ తోటయ్య దొర, టీడీపీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి మధుబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్‌ను పలువురు నేతలు, కార్యకర్తలు అభినందించారు.

జి.సిగడాంకు రవికుమార్..



జి.సిగడాం, జూలై 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా డీఆర్‌వలసకి చెందిన కుమరాపు రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి రణస్థలంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు అనెపు రామకృష్ణంనాయుడు ఆధ్వర్యంలో జి.సిగడాం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా కుదిరెళ్ల బుజ్జి, మండల సమన్వయకర్తగా టంకాల మౌళీశ్వరరావు ఎన్నికయ్యారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని రవికుమార్ అన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, పరిశీలకుడు అనెపు రామకృష్ణ నాయుడు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గాయత్రీ ఐటీఐలో జాబ్ మేళా



జాబ్ మేళా నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం గాయత్రీ ప్రైవేటు ఐటీఐలో వికాస్ హెచ్‌ఆర్ హెడ్ రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా 140 మంది విద్యార్థులు వివిధ కంపెనీలకు సెలెక్ట్ అయ్యారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, ఐటీఐ ప్రతినిధులు, శ్రీసాయి, సెయింట్ జోసెఫ్ ఐటీఐ విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన 'మహిషాసుర మర్దని' హరికథ

శ్రీకాకుళం కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): శ్రీసుమిత్ర కళా సమితి ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో నిర్వహిస్తున్న హరికథా నవరత్నాలులో భాగంగా శుక్రవారం తిరుపతికి చెందిన సీహెచ్ షణ్ముఖ భాగవతారిణి హరికథా గానం చేశారు. మహిషా సుర మర్దని' హరికథ ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఇప్పిలి శంకర్ శర్మ, పొగిరి సుగుణాకర్ రావు, మెట్ట పోలినాయుడు, నక్క శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎండిన చెట్టుతో ప్రమాదం



నందిగాం, జూలై 11(ఆంధ్ర జ్యోతి): ఎంఆర్‌సీ కార్యాలయం ఆవరణలో ఉన్న ఎండినచెట్టుతో ప్రమాదం పొంచివుంది. ఈ ఆవరణలో ఎంఆర్‌సీతో పాటు తహసీల్దార్, వెలుగు, ఉపాధి, వ్యవసాయం, గృహ నిర్మాణశాఖ కార్యాలయాలు ఉన్నాయి. అయితే ఎంఆర్‌సీ వద్ద ఉన్న చెట్టు పూర్తిగా ఎండిపోవడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ఈ ఎండిన చెట్టును తొలగించి ప్రమాదం జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

టిఫిన్ చేస్తుండగా గ్యాస్ లీక్


కాలి బూడిదైన సామగ్రి

ఆమదాలవలస, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పదో వార్డు వాంబే కాలనీలో ఓ ఇంటిలో గ్యాస్ లీకై ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కాలనీకి చెందిన గుంటుకు సరస్వతి టిఫిన్ వ్యాపారం చేస్తోంది. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం టిఫిన్ తయారు చేస్తుండగా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఆమె గాయపడింది. విషయం తెలుసుకున్న ఎదురింట్లో నివసిస్తున్న కోలా మాధవరావు ఘటనా స్థలానికి వెళ్లి మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించగా అతనికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.70 వేలు నష్టం ఉంటుందని బాధితురాలు సరస్వతి వాపోతుంది. ఎస్ఐ ఎస్.బాలరాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్యాస్ సిబ్బంది చేరుకుని ప్రమాదం జరిగిన తీరును బాధితురాలిని అడిగి తెలుసుకున్నారు. స్థానిక టీడీపీ నాయకుడు నాగళ్ల మురళీధర్‌యాదవ్ బాధితురాలిని పరామర్శించారు. అధికారుల దృష్టికి తీసకువెళ్లి న్యాయంచేస్తామని హామీ ఇచ్చారు.

అక్రమంగా డబ్బుల వసూళ్లు

● పెద్దపాడు వద్ద ఇద్దరు అరెస్టు

శ్రీకాకుళం రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పాలకొండ మండలం బాసురు వెంకటపతి రాజుపేట గ్రామానికి చెందిన రైతు గోవిందరావును భయపెట్టి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన కేసులో ఓ ఇద్దరిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం పీఎన్ కాలనీకి చెందిన పైల చంద్రశేఖర్, పెద్దపాడుకు చెందిన బొట్ట శంకర్.. ఓ వివాదంలో గోవిందరావు తన కుమారుడు ఇరుక్కున్నాడు. దీంతో ఆ వ్యక్తులిద్దరూ ఈ కేసు నుంచి తప్పించేందుకు డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. దీంతో గోవిందరావు చంద్రశేఖర్‌కు రూ.1.5 లక్షలు, శంకర్‌కు రూ.20వేలు ఇచ్చాడు. గోవిందరావు శ్రీకాకుళం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వారిద్దరిని పెద్దపాడు ఫ్లై ఓవర్ వద్ద శుక్రవారం అరెస్టు చేశారు. వీరినుంచి రూ.40 వేలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

గ్రామానికి చెడ్డపేరు తెస్తున్నారని ఓ ఇంటికి తాళం

టెక్కలి రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): బూరగాం గ్రామంలోని ఓ ఇంటిలో గత మూడు నెలలుగా కొంతమంది అమ్మాయిలను తీసుకువచ్చి వ్యభిచార గృహంలా మార్చేశారంటూ ఆ గ్రామానికి చెందిన కొంతమంది మహిళలు శుక్రవారం ఆ ఇంటికి తాళం వేసి నిరసన తెలిపారు. చుట్టుపక్కల కుటుంబాలతో నివసిస్తున్నామని, మా గ్రామానికి చెడ్డపేరు వస్తుందన్నారు. బయట గ్రామాలు నుంచి కొంతమంది యువకులు వచ్చి రాత్రి 11 గంటల వరకు ఉంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇలా అయితే మా పిల్లలకు వివాహాలు చేసుకోవడానికి ఎవరూ రారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పోలీసులు కలగుజేసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాల మరుగుదొడ్లలోని ట్యాప్‌ల చోరీ

కోటబొమ్మాళి, జూలై 11(ఆంధ్ర జ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని మరుగు దొడ్లలో ఏర్పాటు చేసిన 20 స్టెయి న్ లెస్‌స్టీల్ ట్యాప్‌లు చోరీకి గురయ్యాయి. ఇటీవల ప్రారంభమైన నూతన మరుగుదొడ్లలోని సుమారు రూ.40వేలు విలువ చేసే ట్యాప్ భిగించగా, గురువారం రాత్రి చోరీ అయినట్టు హెచ్‌ఎం డి.గోవిందరావు తెలిపారు. శుక్రవారం ఉదయానికి తలుపు లు తెరిచి ఉండగా.. లోపలికివెళ్లి చూస్తే చూసేసరికి ట్యాప్‌లు లేవని చెప్పారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

అవగాహనతోనే వ్యాధులు నియంత్రణ


లక్ష్మీనర్సుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ఎల్ఎన్ పేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు అవగాహన పెంపొందించుకోవడం ద్వారా అంటువ్యాధులను నివారించడం సాధ్యమవుతుందని వైద్యాధికారులు సునీత, ప్రియాంక, వసుధ, పాపారావు తెలిపారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష్మీనర్సుపేట గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగ్యూ వ్యాధితోపాటు సాధారణంగా ప్రబలే అంటువ్యాధులను నివారణకు సంబధించిన అంశాలను నినాదాలు చేస్తూ అంటువ్యాధుల నివారణపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలన్నా. కార్యక్రమంలో వీరితోపాటు వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ


సైకిళ్లతో విద్యార్థినులు

సంతబొమ్మాళి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కొల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులకు వసుధైక కుటుంబ యూనివర్సిల్ ఫ్యామిలీ ఫౌండేషన్ ఉచితంగా సైకిళ్లను శుక్రవారం అందించారు. దీంతో జి.హేమ, జె.పద్దు, టి.పూజిత, జి.త్రివేణి పాఠశాల హెచ్‌ఎం రామరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీరాయంజనేయ వ్యాయామ మండల కోచ్ పిలక ధనుంజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి చర్యలు

● 14న పెద్దపాడు పాఠశాలలో స్పాట్ అడ్మిషన్

పాత శ్రీకాకుళం, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 5 నుంచి 12వ తరగతి (ఇంటర్) వరకు మిగిలిన సీట్ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కో ఆర్డినేటర్ గుంపుల గ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటి భర్తీకి ఈనెల 14వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పెద్దపాడు గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతిలో చేరాలనుకునే విద్యార్థులు తొమ్మిదో తరగతి ఫైనల్ మార్కు షీట్ తప్పనిసరిగా అందించాలన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రవేశానికి ఫస్ట్ ఇయర్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9701736862, 9000314209 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రక్తదానం చేసి మరొకరి ప్రాణం నిలబెట్టండి

జలుమూరు, (సారవకోట), జూలై 11(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి మరో ప్రాణాన్ని కాపాడాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. అవలింగి, బుడితి, చీడిపూడి కూడలిలో రామ్‌కి గ్రూపు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రక్తం సకాలంలో అందక చాలామంది మృత్యువాత పడుతున్నారని, అలాంటి వారిని ఆదుకోడానికి యువత ముందుకు రావాలన్నారు. టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, ఎంపీపీ కూర్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి సాధించాలి

పాతపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఏటా కనీసం 15శాతం ప్రగతి సాధించాలని పశుసంవర్థక శాఖ డివిజన్ ఏడీ డాక్టర్ చందక నరసింహులు అన్నారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల సిబ్బందితో శుక్రవారం సమీక్షించారు. విజన్ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలన్నిటిలో ఏటా 15శాతం ప్రగతి సాధించాలని ఆదేశించారు. ఏడీ డాక్టర్ మంచు కరుణాకరరావు, పశువైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వేసవిని తలపిస్తున్న ఎండలు

టెక్కలి, జూలై 11(ఆంధ్రజ్యోతి): వానలు కురవాల్సిన ప్రస్తుత కాలంలో ఎండలు మండిపోతున్నాయి. బయటకు రావాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. గత నాలుగు రోజులుగా 36 డిగ్రీలపైబడి పగటి ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. చాలామంది గొడుగులు వేసుకుని బయటకు వస్తున్నారు. సహజంగా ఆషాఢ మాసంలో రుతుపవనాల ప్రభావంతో అడపాదడపా వర్షాలతో చల్లగా ఉండాల్సింది పోయి వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి.

← గొడుగులు వేసుకుని వెళ్తున్న విద్యార్థులు

ఫరీద్‌పేటలో పట్టపగలే హత్య

● మృతుడి బంధువుల నిరసన

● ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

రణస్థలం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలంలో అత్యంత సమస్యాత్మక గ్రామమైన ఫరీద్‌పేట పరిధిలో పట్టపగలే శుక్రవారం ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త, ఎంపీపీ మొదలవలస చిరంజీవి అనుచరుడు సత్తారు గోపి(46) హత్య గ్రామంలోనే కలకలం సృష్టించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో గోపి, మరో వ్యక్తి కోటేశ్వరరావుతో కలిసి బైక్‌పై కొయ్యరాళ్ల కూడలి నుంచి సర్వీసు రోడ్‌లో ఎచ్చెర్ల వైపు వెళ్తుండగా, అదే రోడ్‌లో ఉన్న ప్రత్యర్థి వర్గానికి చెందిన వ్యక్తులు మూకుమ్మడిగా దాడిచేయగా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బైక్ వెనుక కూర్చొన్న కోటేశ్వరరావు ఈ ఘటనను చూసి అక్కడి నుంచి పరుగులు తీశాడు. సమాచారం అందుకున్న జేఆర్ పురం సీఐ ఎం.అవతారం, ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్ కుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి, మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడికి చేరుకుని పోలీసుల తీరుపై ఆందోళన వ్యక్తంచేశారు. గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతుండగానే హత్య జరగడంపై వారంతా నిరసన వ్యక్తంచేశారు. జాతీయ రహదారిపై బైఠాయించి బాధ్యులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. డీఎస్పీ వివేకానంద ఆందోళనకారులతో మాట్లాడి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సర్దిచెప్పి శాంతింపజేశారు.

మృతదేహం పక్కనే..

కొయ్యరాళ్ల జంక్షన్‌కు సమీపంలో సర్వీసు రోడ్‌లో బైక్‌పై ఎచ్చెర్ల వైపు వెళ్తున్న సత్తారు గోపి దుండగులు అడ్డగించి దాడిచేశారు. ఈ దాడి నుంచి తప్పించుకునేందుకు గోపి పరుగులు తీసినా వెంబడించి మరీ హతమార్చారు. మృతదేహం వద్దనే కర్ర , ఇటుక పడి ఉన్నాయి. సంఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్ సందర్శించి వివరాలు సేకరించింది. మృతుడిపై గతంలో పలు పోలీసు కేసులు నమోదయ్యాయి. పాత కక్షలతోనే ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య సుగుణ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య సుగుణ గ్రామ ఉప సర్పంచ్‌గా ఉన్నారు. మృతుడు గతంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా పనిచేశారు.

ఎస్పీ సందర్శన..

ఘటనా స్థలాన్ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. హత్య జరిగిన తీరును పరిశీలించారు. గ్రామంలో పర్యటించి పోలీస్ పికెట్‌ను మరింత పటిష్ఠంగా నిర్వహించేందుకు సూచనలు చేశారు. మరింత పోలీసు బందోబస్తును పెంచారు.

కొన్నేళ్లుగా సమస్యాత్మకమే..

ఎచ్చెర్ల మండలంలో ఫరీద్‌పేట కొన్నేళ్లుగానే సమస్యాత్మక గ్రామంగానే గుర్తింపు ఉంది. గతంలో ఈ గ్రామంలో హత్యలు కూడా జరిగాయి. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కోటి పాత్రుని పోలినాయుడు, మొదలవలస రాంబాబు, కూన ప్రసాద్ హత్యకు గురికాగా, తాజాగా సత్తారు గోపి హత్యకు గురవడంతో మరింత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాగే టీడీపీ నేత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట అమ్మినాయుడుపై కూడా గతంలో హత్యాయత్నం జరిగింది. ఈ నేపథ్యంలో గ్రామంలో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు పోలీసులు మరింత అప్రమత్తం కావాల్సి ఉంది.

వంశధార ప్రధాన ఎడమ కాలువకు రంధ్రం

● పూడ్చిన అధికారులు.. తప్పిన ముప్పు

టెక్కలి, జూలై 11(ఆంధ్రజ్యోతి): వంశధార ప్రధాన ఎడమ కాలువ టెక్కలి సమీపాన 65.6వ కిలోమీటరు వద్ద లెఫ్ట్ బ్యాంక్ అండర్‌టర్నల్ సమీప గట్టుకు రంధ్రం ఏర్పడింది. అయితే శుక్రవారం ఉదయం రంధ్రం వెంబడి నీరు వెళ్లడం గమనించిన రైతులు వంశధార అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన అధికారులు అక్కడకు చేరుకొని రంధ్రం పూడ్చే పనిలో పడ్డారు. వంశధార ఈఈ బి.శేఖరరావు ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన ఎడమకాలువ గట్టుకు పడిన రంధ్రాన్ని పూడ్చడంతో ముప్పు తప్పింది. వంశధార కాలువ వెంబడి 584 క్యూసెక్కుల సాగునీరు ప్రవహిస్తుందని, సకాలంలో గుర్తించడం ద్వారా ప్రమాదం తప్పిందని ఈఈ తెలిపారు. ప్రస్తుతం మదనగోపాలసాగరంలోకి నీరు పూర్తిస్థాయిలో చేరిందని, శనివారం నాటికి పలాస పరిధిలో కాలువలకు సాగునీరు చేరుతుందని స్పష్టం చేశారు.


కాలువ గట్టుకు పడిన రంధ్రం


రంధ్రం పూడ్చిన తర్వాత ఇలా...

మధ్యవర్తిత్వంతో కేసులు రాజీ చేయాలి


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి వాణి

నరసన్నపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల్లో ఇరువర్గాలను మధ్యవర్తిత్వం ద్వారా రాజీ కుదిరేలా న్యాయవాదులు చొరవ చూపాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.వాణి సూచించారు. శుక్రవారం బార్ కౌన్సిల్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల నుంచి 90రోజులపాటు మధ్యవర్తిత్వం ద్వారా వివాహానికి, గృహ హింసకేసులు, సివిల్ కేసులతో పాటు రాజీకి అనువైన క్రిమినల్ రాజీ చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీ సంతోషి, న్యాయవాదులు రావాడ కొండలరావు, జీవీజీ నాయుడు, జి.అప్పారావు, వై.నరసింహరావు, ఆర్.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల ప్రగతి పై దృష్టిసారించాలి


మాట్లాడుతున్న డీఎల్‌డీవో అలివేలు మంగమ్మ

మెళియాపుట్టి, జూలై 11(ఆంధ్ర జ్యోతి): పంచాయతీల ప్రగతిపై సచివాలయ ఉద్యోగులు దృష్టిసారించాలని డీఎల్‌డీవో అలివేలు మంగమ్మ తెలిపారు. శుక్రవారం సచివాలయ ఉద్యోగులుకు శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంచాయతీలకు వస్తున్న నిధులు సక్రమంగా వినియోగిస్తురో లేదో పరిశీలించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్ పండా, ఈవోపీఆర్డీ తారకేశ్వరి, కార్యదర్శులు శివాజీ, మోహన్, ఢిల్లీ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

నెట్‌వర్క్ లేక సేవలకు దూరం

● తపాలా కార్యాలయంలో ఖాతాదారుల ఇబ్బందులు



కార్యాలయం గేటు వద్ద ఏర్పాటు చేసిన నో నెట్‌వర్క్ బోర్డ్

ఇచ్ఛాపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): తపాలా కార్యాలయంలో నెట్ సర్వీస్ లేకపోవడంతో గత రెండు రోజులుగా వివిధ రకాల సేవలు నిలిచిపోయాయి. శుక్రవారం ఉదయం 9 గంటలకు వచ్చిన ఖాతాదారులు కార్యాలయం ముందు నో నెట్‌వర్క్ బోర్డు కనిపించడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండు రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు స్పందించడం లేదని వారు వాపోతున్నారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్నా నెట్‌వర్క్ పనిచేయడం లేదని సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఓ ఖాతాదారుడు పీఎల్ఐ కట్టేందుకు రాగా పురుషోత్తపురం వెళ్లాలని సిబ్బంది చెప్పడంతో ఆయన అసహనానికి గురయ్యాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు ఖాతాదారులు కోరుతున్నారు.

ఉపాధ్యాయురాలికి అభినందన



టెక్కలి రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంలో కృషి చేసిన గంగాధరపేట పాఠశాల ఉపాధ్యాయురాలు ఎస్.భవనీని డీఈవో తిరుమల చైతన్య శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలో పిల్లలు లేకపోవడంతో పాఠశాల మూతదిశగా వెళ్లింది. అయితే భవానీ పాఠశాల తెరుచుకున్న 21 రోజుల్లో 22 మంది విద్యుర్థులను ప్రైవేట్ పాఠశాలల నుంచి తీసుకువచ్చి చేర్పించింది. దీంతో ఆమెను గ్రామస్థులతో కలిసి ప్రత్యేకంగా అభినందించారు.

నమ్మకం కలిగేలా వైద్య సేవలు అందించాలి


వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు, (సారవకోట), జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల పైన, వైద్యాధికారుల పైన రోగులకు నమ్మకం కలిగేలా మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుడితి సామాజిక ఆసుపత్రిని శుక్రవారం పరిశీలించి ఇద్దరు బాలింతలు మృతిచెందడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోగులకు వైద్యసేవలందించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏ పనిలో కూడా నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ఓపీని పెంచాలన్నారు. ఇద్దరు బాలింతలు మృతిపై ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఆసుపత్రిలో గల రోగులతో మాట్లాడి వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం యలమంచిలి, పాగోడు గ్రామాలకు వెళ్లి మృతిచెందిన బాలింతల కుటుంబాలకు పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయకర్త బగ్గు అర్చన, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, జలుమూరు, సారవకోట మండలాల టీడీపీ అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, కత్తిరి వెంకటరమణ, వైద్యాధికారులు బి.శోభారాణి, ఆదిలక్ష్మీ, మూకళ్ల చైతన్య, వినోద్, భార్గవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలినాయుడు చెరువులో ఆక్రమణలపై సర్వే

వజ్రపుకొత్తూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): బెండి పంచాయతీ పరిధిలోగల పోలినాయుడు చెరువులో ఆక్రమణలు జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు మండల సర్వేయర్ తిరుపతిరావు ఆధ్వర్యంలో చెరువు మొత్తం ఆయుకట్టును సర్వే చేశారు. పది సెంట్లు చెరువుభూమి ఆక్రమణలో ఉన్నట్లు గుర్తించామని సర్వేయర్ తిరుపతిరావు చెప్పారు. సంబంధిత రైతును పిలిచి ఆక్రమణలో ఉన్న భూమి స్వాధీనం చేసుకుంటున్నట్టు చెప్పామన్నారు . కాగా చెరువు ఆయకట్టు ద్వారా మహదేవుపురం రైతులు పంటలు నీరందు తుందని అయితే ఆక్రమణలు జరుగుతున్నట్టు అధికారులకు ఫిర్యాదు చేసిన వెంటనే సర్వే చేయించి ఆక్రమణలు తొలగింపునకు చర్యలు చేపట్టడంపై గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర బృందం సర్వే

పాతపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం నిర్వహణ ప్రోత్సాహకమే లక్ష్యంగా సర్వే చేస్తున్నట్టు రీసెర్చ్ ఇన్విస్టిగేటర్ పుణ్యశ్రీ తెలిపారు. మేజర్ పంచాయతీ పాతపట్నంలో ఎస్ఎస్‌జీ-2025 స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ సర్వేపై కేంద్రం నుంచి పుణ్యశ్రీ నేతృత్వంలో రాష్ట్రప్రభుత్వ వివిధ శాఖాధికారుల బృందం పాతపట్నంలో పారిశుధ్య నిర్వహణపై శుక్రవారం పరిశీలించారు. పంచాయతీ ఈవో, సచివాలయ సిబ్బంది తదితరుల సర్వేలో పాల్గొన్నారు. స్థానిక శివశంకర్ కాలనీలో అంగనవాడీ కేంద్రాన్ని శ్రీనీల మణి దుర్గ ఆలయప్రాంగణం తదితర చోట్ల పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్ అమ్మాజీరావు, ఎఫ్‌టీసీ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

వజ్రపుకొత్తూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణం కాపాడాలని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వర రావు అన్నారు. శుక్రవారం పూండి గోవిదంపురం ప్రాథ మిక పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేప ట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

● పలాసరూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మొక్కల తోనే జీవనాధారమని, వాటిని సంరక్షించి ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత ఉందని పాఠశాల చైర్మన్ డోకి రామారావు అన్నారు. పలాస మండలం సున్నాడ పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి విద్యార్థులతో మొక్కలు నాటించారు.

10 అడుగుల కొండచిలువ హతం



జలుమూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): పెద్దదూగాం సమీపంలో శుక్రవారం ఉదయం వ్యవసాయ పనులకు వెలుతున్న రైతులకు 10 అడుగుల కొండచిలువ తారస పడింది. గ్రామం సమీపంలో ఉన్న పశువులశాలల్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా.. గ్రామస్థులు గుర్తించి పొలాలు వైపు పంపించేందుకు ప్రయత్నించారు. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కర్రలతో కొట్టి చంపేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): రొంపివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమత్తులు చేపట్టనుండడంతో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ జి.శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో రొంపివలస, సీది, గంగుపేట, తీమర, తామర, సోద, కొమనాపల్లి, రౌతుపురం, రౌతులక్ష్మీపురం, ఏఎస్‌కవిటి, చాకిపల్లి, ఎస్ఎస్ మణుగు, బైదలాపురం, శోభ, పి.సున్నాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండగదన్నారు.

పొన్నాడ సబ్‌స్టేషన్ పరిధిలో రేపు

ఎచ్చెర్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి):11 కేవీ ఫీడర్ల ఆర్‌డీఎస్ఎస్ పనులు, కొత్తలైన్ల ఏర్పాటు కోసం పొన్నాడ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.యోగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పొన్నాడ, కొత్తపేట, వెంకన్నగారిపేట, తెప్పరేవు, సెగిడిపేట, మాలముద్దాడ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

కూటమి మోసాలను ఎండగడదాం

నరసన్నపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ఈ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం నరసన్నపేటలోని ఓ కల్యాణ మండపంలో నియోజవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, పోలాకి జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించాలి


వినతులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పలాస, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులకు ఆదేశించారు. కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ప్రజాపరిష్కార వేదిక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులపై చట్టపరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతు లు స్వీకరించి వారి సమస్యలను విని సానుకూలంగా స్పందించి ఆయా సమస్యలపై పూర్తి స్థాయి విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. సివిల్, కుటుంబ కలహాలు, ఆస్తికొట్లాట, మిస్సింగ్, చీటింగ్ ఇతరత్రా అంశాలపై ఫిర్యాదులు అందాయని తెలిపారు.

